"కథ చెప్పు తాతయ్యా" అని వేధిస్తున్నారు శాస్త్రి గారి మనమలు చుట్టూ చేరి.

"ఏం కథ చెప్పనురా?", అని ఆలోచిస్తున్నట్టు బోసి నోరు విప్పి పైకి చూశాడు ఎనభై ఏళ్ళు పైబడుతున్న శాస్త్రిగారు.

"ఏదో ఒకటి" అంటూ నిద్రకి ఓ పక్క ఆవలిస్తూ చేతులు పట్టుకు గుంజుతున్నారు పిల్లలు.

"సరే" అంటూ ... మొదలెట్టాడు శాస్త్రిగారు. "ఓ రోజున..." ఊ కొడుతున్న చిన్న పిల్లలతో పాటు పట్నం కాలేజీలో చదువుతున్న శాస్త్రి గారి పెద్ద మనుమడు కూడా చదువుతున్న పుస్తకం మూసి వింటున్నాడు.

"చాలా సంవత్సరాల క్రితం... నాకు పెళ్ళయిన కొత్తలో..."

"అంటే నేను పుట్టిన తర్వాతనా?" అన్నాడు ఆఖరి మనవడు.

"ఇహ్!" అని నోరంతా విప్పి నవ్వి వాణ్ణి ఒళ్లోకి తీసుకుని మళ్లీ మొదలెట్టారు శాస్త్రిగారు.

"పెద్దింటమ్మ గుడి దగ్గర చేనికెళ్లి వస్తున్నాను. అటూ ఇటూ పొలాలు, కనుచూపు మేర భూమంతా పచ్చటి కంబళీ పరచినట్లుంది. నేల తల్లి చిలకాకు పచ్చ చీర వళ్లంతా చుట్టుకున్నట్టు పొలాలు, పొలం చుట్టూ తిరిగి, గట్టు పక్కన కుంటలో కాసినీళ్లు తాగి అట్లా డొంకలోకొచ్చాను. మావిళ్ల చేను దాటానో లేదో చిటపట చినుకులు ప్రారంభమైనాయి. తలెత్తి పైకి చూస్తే సూర్యు డెక్కడికో పారిపోయాడు. నల్ల మేఘాలు గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నాయి. ఆకాశమంతా నల్ల మేఘాలే, నల్ల చీర కట్టుకున్న ఆడదాని మొల్లో బాకులాగా నల్ల మేఘాల మధ్య ఓ మెరుపు, తూర్పు వైకుంఠపురం కొండ మీది ఓ గర్జింపు - వాన పెద్దదైంది.

"వలవల కురుస్తోంది వాన!

"జల జల కురుస్తోంది వాన!

"నేను గొడుగు తెచ్చుకోకపోతిని. పూర్తిగా తడిసిపోయాను. అయినా గొడుగులూ, గోనె గుడ్డలూ ఏమిటి? అల్లంత ఆకాశ గంగ పనిగట్టుకొచ్చి ఈ నేల తల్లిని చల్లగా కౌగిలించుకుంటుంటే - ఈ మనిషన్న వాడెవడూ గొడుగడ్డం పెట్టుకోవడానికి?

"ఉన్నట్టుండి మబ్బులు పెద్ద పెట్టున ఉరిమాయి. వర్షరాణి తీవ్ర వేగంతో రథం నడిపిస్తుంటే రయ్యిన పరుగెత్తే రథ చక్రాల ధ్వనిలా ఉంది ఆ ఉరుము. ఆ ఉరుము అలా దూరమవుతుంటే అదిలించినప్పుడు ఆ రథానికి పూన్చిన గుర్రం సకిలింపులా ఉంది. అల్లంతలో మబ్బుల్లో గొప్ప మెరుపు. అది వర్షరాణి కిరీటంలా ఉంది. కిరీటమే మిరుమిట్లు గొల్పితే ఆ రాణి ఎలా ఉంటుందో? అలంకారాలు చూడ్డానికే ఈ కళ్ళు మూసుకుపోతుంటే ఇంక ఆకారాలెలా కనిపిస్తాయి?

"డొంకలో బురద బురదయిపోయి కాలు సాగడం లేదు. చెప్పులు విడిచి చేతబట్టాను. వరె వరె! అప్పుడనిపించిందిరా! గంగమ్మ ఈ భూమినంతటినీ చల్లబరుస్తుంటే, నేనూ చల్లబడక ఈ పాత చెప్పులడ్డం పెట్టుకున్నానా?" అని ఇప్పుడు వర్షం నా మీద కురుస్తోంది. నా లోంచి కురుస్తోంది. జల్లు జల్లుగా కురుస్తోంది. భళ్లు భళ్లున కురుస్తోంది. వర్షపు చల్లదనం శిరస్సు నుంచి పాదాల దాకా పాకి శరీరంలోని నర్వాణువుల్ని కడిగేస్తోంది. ఆ చల్లదనం నరనరాల్లోకి పరుగులెత్తి వెచ్చగా ఉంది. అది ఎన్ని స్నానాల పెట్టు! ఎన్ని మునకలు దానికి దీటు! వర్షమంతా నా మీదే పడాలనిపించింది! నన్ను ముంచేయాలనిపించింది. ఆ సమయంలో నేను నడవడం మానేసి, వారేయ్! ఆ డొంక మధ్యలో నిటారుగా నుంచున్నారా!

"అటు పక్క చూస్తే పొలాల మీద వాన, మంచి శనగ చేను మీద వానపడుతుంటే ఆ మేరంతా పైరంతా ఆనందంగా వూగుతోంది. దనియాల చేను మీద వానపడుతుంటే ఆ మేరతా కొత్తిమిర వాసన, వాన సుగంధం కలిసిపోయిన గాలి. వానకి జొన్న చేను నృత్యం చేస్తోంది. మొక్కజొన్న కండెలుబ్బిపోతున్నాయి. సజ్జ కంకులు పొంగుతున్నాయి. వరి ఉన్నట్టుండి పెరుగుతోంది. కందికాయలు, పిల్లిపెసర్లు కువకువలాడుతున్నాయి. వేరుశనగ చేను విచ్చుకుని, వేళ్లలోకి దింపుకుంటోంది వర్షధారల్ని అలా నేల నేలంతా, పైరు పైరంతా వర్షానికి పరిపరి విధాలుగా పులక లెత్తుతోంది. పొలాల మీద వాన కొంచెం కొంచెం తగ్గుముఖం పట్టినట్లనిపించింది. కుడి పక్కకి తిరిగి చూస్తే కృష్ణ మీద వర్షం జోరుగా ఉందనిపించింది. కృష్ణ వొడ్డుకు బయల్దేరాను. అలా ఎందుకనిపించిందీ అని అడక్కు. రంగావజ్ఝల వారి చేను దాటి అలా కృష్ణ వొడ్డుకి వస్తిని గదా-

"వరెవరెవరె! అదీ వర్షం!

"అంత గొప్ప ప్రవాహంలో సంతత ధారగా వానపడిపోతోంది. నీళ్లలో నీళ్లు! ధారలో ధార! ప్రవాహంలో ప్రవాహం! వాన చినుకులు కృష్ణలో పడుతుంటే పెద్దక్క ప్రేమగా హత్తుకుంటే ఒళ్లు జలదరించినట్టు, ఆ ప్రవాహం మీద ఓ జలదరింపు, ఓ పులకరింపు, సిగ్గుతో నవ్వినప్పుడు బుగ్గ మీద సొట్టలా చినుకు పడ్డ చోట చిన్న గుంట - అంతలో ఆ గుంట మాయం. మళ్లీ చినుకు, మళ్లీ గుంట, మళ్లీ మళ్లీ చినుకులు. అంతలో మాయమయి మళ్లీ మళ్లీ గుంటలు. కృష్ణంతా చినుకులు. కృష్ణంతా పులకరింతలు, ఇసక మీద చినుకులు, కసకస చినుకులు, రేణు రేణువుకీ చినుకులు. పిసపిస, సరసర చినుకులు. రివ్వుమని, రయ్యిమని చినుకులు, తూపుల్లా చినుకులు, తావుల్లా చినుకులు. భళ్లుమని, ఫెళ్లుమని, ధభిల్లుమని, పెఠిల్లుమని చినుకులు - చినుకులు - కృష్ణ నిండా, ఇసకనిండా, నేలనిండా - చినుకులు - రెండు గంగలు కలిసిపోయినట్టు, నింగీ నేలా ఒకటే అన్నట్టు. ఈ జగత్తులో నీళ్లు తప్ప ఇంకేవీ లేనట్టు. అన్నింటికీ నీళ్లే ఆధారం అన్నట్టు - వాన, వర్షం, గంగమ్మ కిష్టమ్మ, సంద్రం - అదేదో దానికి నువ్వేపేరైనా పెట్టుకో.

"అలా ఆ అఖండ జల ప్రపంచం మధ్య మతిపోయి నుంచున్నానా - పడవ్వాళ్లు నలుగురైదుగురు వచ్చి - "శాస్తుల్లు గారు ఈదున్నారేటి?" అన్నారు. అప్పుడీ లోకంలో పడి - నే నిక్కడే ఉంటాననంటే - "ఇదేవన్నా మతిభ్రమణవేమో" అనుకుంటారేమోనని వాళ్ల వెంట వూళ్లోకొచ్చాను."

"వర్షం ఆగిపోయిందని చెప్పకు తాతయ్యా" అన్నాడు కాలేజీలో చదువు

# రెండు గంగలు

## సత్యం శంకరమంచి

[అమరావతి కథలు నుంచి- నవయుగ పబ్లిషర్స్ సౌజన్యంతో]





తున్న మనవడు. అప్పటికి మిగతా మనవలు నిద్రపోయారు.

"లేదురా ఇంకా కురుస్తోంది. ఆగకుండా కురుస్తోంది. ఇల్లు దగ్గర పడుతున్న కొద్దీ కంగారెక్కువైంది. నాయనమ్మో! కొత్తగా కాపరానికొచ్చిన చిన్న పిల్లయ్యే! అందులో పట్నంలో కచ్చేరీ గుమాస్తా గారి కూతురేమో, వర్షంలో తడిసి జలుబు చేసి ఎక్కడ ముక్కూడగొట్టుకుంటుందో అని గబగబ నడిచాను. ఇంట్లోకొస్తే ముందు వరండాలో లేదు. మధ్య గదిలో లేదు. వంటింట్లో లేదు. "ఓహెూయ్!" అని కేకేస్తే బదులు లేదు. గబగబా దొడ్లోకొస్తే దొడ్డి చివర ఆరుబయట కృష్ణ వైపు తిరిగి నుంచుని కనిపించింది. వర్షం కృష్ణలో కలుస్తుంటే, వర్షంలో తను కలిసిపోయి, చేతులు విప్పార్చి తలములకలుగా హాయిగా తడుస్తోంది." ●